సాక్షి
నిజామాబాద్

గురువారం । 7 । మార్చి । 2024



కాంగ్రెస్ మోసం చేసింది

కాంగ్రెస్ తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు.

- 8లో ▸



సాగుకు సాంకేతికత

సాగుకు సాంకేతికతను అనుసంధానం చేసేందుకు రైతునేస్తం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
35.8 /23.8

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తెరుచుకున్న మాధవనగర్ రైల్వే గేట్



నిజామాబాద్ రూరల్: మాధవనగర్ రైల్వే గేట్ బుధవారం సాయంకాలం తెరుచుకుంది. గేటు మూసివేయడంతో గత నెలన్నర రోజులకుపైగా వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా కొత్తగా జిల్లాకు వచ్చిన వారికి, జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు వెళ్లే వారికి మార్గం తెలియక అనేక అవస్థలు పడ్డారు. ప్రస్తుతం మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్న సందర్భంగా ఇప్పటివరకు పిల్లర్లు, అప్రోచ్ రోడ్డు పని పూర్తవడంతో అధికారులు, రైల్వే శాఖ అధికారుల సమన్వయంతో రైల్వేగేటును తెరిచారు. రైల్వే గేటు ప్రారంభం కావడంతో జిల్లా కేంద్రం నుంచి వెళ్లే ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు, రేపు పసుపు విక్రయాలు బంద్

సుభాష్‌నగర్: మహాశివరాత్రి సందర్భంగా నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గురు, శుక్రవారాల్లో పసుపు క్రయవిక్రయాలు నిలిపేయాలని మర్చంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు బంద్ పాటిస్తున్నట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8న మహా శివరాత్రి సందర్భంగా 7వ తేదీన పసుపు క్రయవిక్రయాలు జరగవని, కేవలం కాంటాలు మాత్రమే జరుపుతామని పేర్కొన్నారు. ఆ రోజు ఇతర పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు మాత్రమే జరుగుతాయన్నారు. పసుపు క్రయవిక్రయాలు సోమవారం నుంచి మార్కెట్‌యార్డులో యథావిధిగా కొనసాగుతాయన్నారు.

వేములవాడకు ప్రత్యేక బస్సులు

ఖలీల్‌వాడి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ రీజియన్ పరిధిలోని డిపోల నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్ఎం జానీరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలుగకుండా బస్సులను అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి లొంక, కామారెడ్డి నుంచి మద్దికుంట, సంతాయిపేట్‌కు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. కావున భక్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్మూర్ అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరు



ఆర్మూర్: నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 6 కోట్లు మంజూరు చేసినట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ కుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించి అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని కోరామన్నారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులను మంజూరు చేశారని తెలిపారు.

ఇద్దరిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో జిల్లాలో ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. జిల్లాలో మొత్తం 17,229 మంది విద్యార్థులకు గాను 16,602 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. 627 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. నిజామాబాద్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థిని, వర్ని మోడల్ స్కూల్ కళాశాలలో ఓ విద్యార్థి చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుని మాల్ ప్రాక్టీస్ కేసునమోదు చేశారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్‌ల ఆధ్వర్యంలో 45 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశా రు. ఇప్పటి వరకు జిల్లాలో ఏడుగురు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. డీఐఈవో రఘురాజ్ నిజామాబాద్‌లో పలు కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 17 పరీక్ష కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్‌లు 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయి.



నమో నీలకంఠాయ..

● రేపు మహాశివరాత్రి వేడుకలు ● ముస్తాబవుతున్న శైవక్షేత్రాలు ● శివయ్య దర్శనానికి ఏర్పాట్లు

క్షీరసాగర మథనంలో ఉద్భవించిన అమృతాన్ని, అందరికీ పంచి గరళాన్ని తన కంఠంలో దాచుకున్న పరమశివుడు నీలకంఠుడయ్యాడు. అన్ని పండుగలు పగటిపూట జరిగితే మహా శివరాత్రి మాత్రం రాత్రివేళ జరుగుతుంది. అభిషేకం, ఉపవాసం, జాగరణతో పరమేశ్వరుడిని కొలిచే దివ్యమైన రాత్రి శివరాత్రి. భక్తులు శివుడిని పూజిస్తే విశేష పుణ్య ఫలాలు అందుతాయని పురాణం చెబుతోంది. లయకారుడైన పరమశివుడు లింగరూపంలో ఉద్భవించిన శివరాత్రి వేడుకల కోసం జిల్లాలో శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. రేపు శివాలయాలు హరహర మహాదేవ, శంభోశంకర నామస్మరణలో మార్మోగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలతో పాటు పరిసర ప్రాంతాలను దేవాదాయ, ధర్మదాయ శాఖ, ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శివరాత్రి సందర్భంగా పరమశివుడిని దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శివాలయాలు వాటి విశిష్టతలపై ప్రత్యేక కథనం..

- నిజామాబాద్ సిటీ

నీలకంఠేశ్వరాలయం..

జైన ఆర్య శిల్పకళా కౌశల అపురూప స్వయంభూ శ్రీ నీలకంఠేశ్వర ఆలయానికి సుమారు 1400 ఏళ్ల చరిత్ర ఉంది. సృష్టి స్థితిలయకర్తలైన బ్రహ్మ, విష్ణు, పరమేశ్వర స్వరూపంతో హరిహాద్వైతాన్ని ఈ ఆలయం చాటి చెబుతుంది. శాతావాహన రాజు రెండో పులకేశి జైన మతాన్ని స్వీకరించిన అనంతరం ఈ ఆలయాన్ని జైనాలయంగా తీర్చిదిద్దినట్లు ప్రతీతి. కాకతీయ రాజులు అనంతరం శివాలయంగా మార్చారని స్థల పురాణం చెబుతోంది. రెండో పులకేశి నాటి ఈ దేవాలయంలో స్వయంభూ శివలింగం, విష్ణువు నాభి నుంచి ఉద్భవించిన బ్రహ్మ ఉండడం గమనించి నీల కంఠేశ్వరాలయంగా మలిచారు. ఆలయంలో జైన, ఆర్య శిల్పకళల మేళవింపు అడుగడుగునా ప్రతిబింబిస్తుంది. ఆలయం, కోనేరు, ఉపాలయాలు అన్ని కలిపి మూడు ఎకరాల్లో ఈ ఆలయం ఉంది. ఆలయంలో ఉత్తర దిక్కున పవిత్రమైన కోనేరు, ప్రాచీన రథం కలిగిన రథశాల, ఆలయగర్భం ప్రవేశానికి నాందీ వచనము పలికే మహానందీశ్వరుడు ఆలయ శోభను మరింత ఇనుమడింప చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం రథసప్తమి నాడు రథం తిరుగుతుంది.

శంభులింగేశ్వరాలయం



భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం శంభులింగేశ్వరాలయం. ఈ ఆలయం నగరంలోని నెహ్రూపార్క్ సమీపంలో ఉంటుంది. త్రేతాయుగంలో స్వయంభుగా వెలిసిందని పురాణం చెబుతోంది. ఈ ఆలయానికి శంభుని గుడిగా, స్వయంభు శ్రీ శంభులింగేశ్వర స్వామి అని పేరుతో భక్తులు కొలుస్తారు. కాలక్రమేనా శాతవాహనులు, జైనులు, కాకతీయులు వారివారి పాలనలో వారి చిహ్నాలతో గర్భాలయ ముఖ ద్వారం, మండపం నిర్మించారు. ప్రస్తుతం ఈ ఆలయం స్వయంభూ శంభులింగేశ్వర స్వామి దేవస్థానంగా ప్రసిద్ధి చెందింది. ప్రతియేటా మహాశివరాత్రి రోజు ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

కేదారీశ్వరాలయం



నందిపేట్ మండల కేంద్రంలో గల శ్రీ కేదారీశ్వర ఆలయం ఎంతో ప్రాచుర్యం పొందింది. 30 ఏళ్ల క్రితం ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రాంతమంతా ఒక దట్టమైన అడవిలాగా ఉండేది. ఈశ్వరుడి అనుగ్రహంతో సాధూ సత్పురుషులతో ఓ చిన్న గుడి కేదారీశ్వర మహా ఆలయంగా మారింది. ఆలయ ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజున ఆలయంలో తపస్సు చేసి అర్ధరాత్రి బయటకు వచ్చి భక్తులకు విభూతి బొట్టు పెడతారు. కార్యక్రమానికి నందిపేట్ చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల మంది భక్తులు ఇక్కడికి తరలివస్తారు.

భజన పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పలు ఆలయాల్లో భజన బృందం కళాకారులు భక్తిగీతాలు ఆలపించనున్నారు. నందిగుట్టలో భజనలు, కీర్తనలు జరుగుతాయి. ఇక్కడ భజనలో శివనామ స్మరణతో నందిగుట్ట ప్రాంతమంతా మార్మోగుతుంది.

లొంక రామలింగేశ్వరాలయం




సిరికొండ: జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం సిరికొండలోని లొంక రామలింగేశ్వరాలయం. సిరికొండ నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని దట్టమైన అడవుల్లో గుట్టల మధ్య ఉన్న లొంకలో కొలువైన ఈ పురాతన ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. త్రేతాయుగంలో వన వాసం సమయంలో సీతను వెతుకుతూ వచ్చిన రాముడు లొంకలో విడిది చేశారని పురాణాలు చెబుతున్నాయి. ఉదయం రాముడు ఇక్కడి సెలయేరులో స్నానం గావించి పూజ కోసం సెలయేరులో నుంచి ఇసుకను తీసుకువచ్చి రాముడు సైకత లింగాన్ని త యారు చేసి పూజలు చేశాడని ప్రతీతి. శ్రీరాముడే స్వయంగా రూపొందించిన లింగం కావడంతో ఈ ఆలయానికి రామలింగేశ్వర స్వామి ఆలయమని పేరు వచ్చినట్లు ఇక్కడి ప్రాంత వాసులు విశ్వసిస్తుంటారు. మాఘ అమవాస్య వంటి పవిత్ర దినాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఇక్కడి కోనేటిలో స్నానాలు చేసి దైవ దర్శనం చేసుకుంటారు. ఏటా మహా శివరాత్రికి ఆలయం వద్ద మూడు రోజుల పాటు జాతర జరుగుతుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా ఇక్కడికి తరలివస్తారు. శివరాత్రి జాగరణ సమయంలో స్వామి వారికి నిర్వహించే నిశిపూజ వైభవంగా జరుగుతుంది. ఆల యం వెనుక భాగంలో గల చెట్లకు తేనె తెట్టెలు ద్వారపాలకులుగా దర్శనమిస్తాయి.

లింగేశ్వరగుట్ట శివాలయం



జిల్లా కేంద్రానికి సమీపంలోని మల్లారం అటవీ ప్రాంతంలో గల శ్రీ లింగేశ్వరగుట్ట ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. దట్టమైన అటవీ ప్రాంతంలో ఆలయం స్థాపించబడింది. 2003 సంవత్సరంలో పిట్ల కృష్ణ మహరాజ్ స్వామి ఈ గుట్టకు వచ్చాడు. ఆ సమయంలో అక్కడ ఎటువంటి సౌకర్యాలు లేకుండా ఉండేది. స్వామితో పాటు అతని శిష్యుడు చెట్ల కిందే పడుకునే వారు. అనంతరం గుట్టపై స్వామిజీ వచ్చారని తెలుసుకున్న చుట్టుపక్క గ్రామాల ప్రజలు ఇక్కడకు రావడం మొదలుపెట్టారు. దాంతో 2007లో కాశీలో ఉన్న ఆలయం మాదిరిగా ఇక్కడ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి శివరాత్రి నాడు ఆలయంలో లింగంపై ప్రతి భక్తుడు స్వయంగా పాలు పోసే అవకాశం కల్పిస్తారు. దాంతో వేల సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తారు. స్వామి తపస్సు చేసి రాత్రి 12.05 గంటలకు బయటకు వచ్చి కాగడాల వెలుతురులో దర్శనం ఇచ్చి శివతాండవం చేస్తారు. దీనిని తిలకించేందుకు వేలమంది భక్తులు ఆ రాత్రంతా అక్కడే జాగరణ చేస్తారు.

నాగారం నందిగుట్ట శివాలయం



నాగారం ప్రాంతం నందిగుట్ట శివాలయం సుమారు 750 ఏళ్ల క్రితం వెలిసింది. కొండగుట్ట నడుమ శివాలయం ఏర్పడడంతో ఇప్పటికి దీనిని అలాగే ఉంచారు. స్వయంభుగా శివాలయం ఇక్కడ వెలియడంతో ప్రతి శివరాత్రికి ఇక్కడ పెద్ద జాతర జరుగుతుంది. శివరాత్రి పర్వదినం రోజు రాత్రి 12.21 గంటలకు భక్తులకు అగ్నిగుండ ప్రవేశం ఈ ఆలయం ప్రత్యేకత. ఈ ఆలయంలో శివపార్వతుల కల్యాణం, శివలింగోద్భవ పూజ కార్యక్రమాలు జరుగుతాయి.

మక్క రైతుకు ధరాఘాతం

● క్వింటాలుకు రూ. 200 తగ్గింపు
● మరింత తగ్గుతుందంటున్న వ్యాపారులు.. రైతుల్లో ఆందోళన



రోడ్డుపై ఆరబోసిన మక్కలు

బాల్కొండ: ప్రస్తుత యాసంగి సీజన్‌లో జొన్న పంటకు ప్రత్యామ్నాయంగా మక్క పంటను అధికంగా సాగు చేశారు. అందులో కొంత సీడ్ పంటను బైబ్యాక్ ఒప్పందం కింద వేశారు. ఇంకొంత మంది సాధారణ మక్కలను సాగుచేశారు. అయితే మక్క పంటకు రోజురోజుకు ధర తగ్గుతోంది. పక్షం రోజుల క్రితం క్వింటాలుకు రూ. 2300 ధర చెల్లించిన వ్యాపారులు ప్రస్తుతం రూ. 200 తగ్గించారు. క్వింటాలు పంటను రూ. 2100 లకు కొనుగోలు చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు చివరికి వ్యాపారుల సిండికేట్ వలన ధరా ఘాతం తగ్గడం లేదు. దీంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జొన్న పంటకు ధర రాదని భావించిన కొందరు రైతులు మక్కపంట వైపు మళ్లారు. అయితే లాభం లేకపోయింది. మక్క పంటకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. శ్రమ కూడా ఎక్కువే. మక్క పంటకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ. 2208 ఉంది. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర కూడ రైతులకు దక్కడం లేదు. మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ఉంటే రైతులకు ఈ ఇబ్బందులు ఉండేవి కావంటున్నారు. పాలకులు, ప్రభుత్వాలు స్పందించి వెంటనే మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

దిగుబడికి దిగులు లేదు..

యాసంగి సీజన్‌లో మక్క పంట దిగుబడికి దిగులు లేదని, ఎకరానికి గరిష్ఠంగా 40 క్వింటాళ్లు, కనిష్ఠంగా 35 క్వింటాళ్ల వస్తోందని రైతులు చెబుతున్నారు. కాగా ఆశించిన ధర మాత్రం రాకపోవడంపై నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

ధర తగ్గిస్తున్నారు..

మక్క పంటకు రోజు రోజుకు ధర తగ్గిస్తున్నారు. ముందు క్వింటాలు పంటను 2300 రూపాయాలకు కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం రూ. 2100 అంటున్నారు. మరింత ధర తగ్గుతుందని వ్యాపారులు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- గంగాధర్, రైతు, ముప్కాల్

ఓవరాల్ చాంపియన్ నిజామాబాద్

ముగిసిన రాష్ట్రస్థాయి విద్యుత్ క్రీడాపోటీలు

నిజామాబాద్‌నాగారం: రాష్ట్రస్థాయి విద్యుత్ క్రీడాపోటీల్లో నిజామాబాద్ జట్టు అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఎస్ఈ రాపెల్లి రవీందర్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్ పోటీలు మూడు రోజులుగా సాగాయి. ముగింపు టోర్నీకి ముఖ్య అతిథిగా ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ బి అశోక్‌కుమార్ హాజరై మాట్లాడారు. యాంత్రీకరణ జీవితంలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సూర్యానారాయణ, స్పోర్ట్స్ సెక్రటరీ గోపి, కోశాధికారి ఉత్తమ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి తోట రాజశేఖర్, గంగారాం నాయక్, సురేష్, మూర్తి, దినేష్, అనిల్, డీఈలు వెంకటరమణ, శ్రీనివాస్‌రావు, రాజేశ్వర్‌రావు, ఉత్తం జాడే, విక్రమ్, ఏడీఈలు వీరేశం, లింబాద్రి, రిఫ్రిస్, దుర్గాప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విజేత జట్లు

- టగ్ ఆఫ్ వార్‌లో విజేతగా నిజామాబాద్ జట్టు, రన్నర్‌గా హైదరాబాద్ సౌత్ జట్టు నిలిచింది.
- ఫుట్‌బాల్‌లో విజేతగా మహబూబ్‌నగర్ జట్టు, రన్నర్‌గా వరంగల్ జట్టు నిలిచింది.
- అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను నిజామాబాద్ జట్టు కైవసం చేసుకుంది.



అథ్లెటిక్స్‌లో ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన నిజామాబాద్ జట్టు

మెరుగైన వైద్యం అందించాలి

● జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు
● కొనసాగుతున్న స్థాయీ సంఘ సమావేశాలు



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్ రూరల్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సూచించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో బుధవారం రెండో రోజు వివిధ శాఖలపై స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందల్వాయి జెడ్పీటీసీ సుమనారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఆస్పత్రికి వచ్చిన పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులకు అత్యవసర సమయంలో ఫోన్ చేస్తే ఎత్తాలన్నారు. విఠల్‌రావు మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, మధ్యాహ్న భోజన పథకం అమలును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఆయూష్ శాఖ కూడా ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని, ఆ శాఖ కల్పించే సదుపాయల గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సరైన ధరలకు మందులు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని డ్రగ్స్ శాఖ అధికారులను ఆదేశించారు. జెడ్పీ సీఈవో ఉష, డీఎంహెచ్‌వో సుదర్శనం పాల్గొన్నారు.

గుడ్లగూబ స్వాధీనం



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల త్రిమూర్తి ఎంటర్ ప్రైజెస్‌లో చొరబడిన గుడ్లగూబను బుధవారం ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భవనంలోకి వచ్చిన ఈ వన్య ప్రాణి బయటకు వెళ్లలేకపోవడంతో షాపు నిర్వాహకులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే టాస్క్‌ఫోర్స్ ఎఫ్ఆర్వో రామేశ్వర్ రెడ్డి, వైల్డ్‌లైఫ్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సురేశ్ కుమార్ వచ్చి గుడ్లగూబను పట్టుకుని జిల్లా ఫారెస్టు కార్యాలయానికి తీసుకెళ్లి విడిచిపెట్టారు.

ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్‌గా షేక్ మున్ను

● బడ్జెట్ సమావేశానికి అధ్యక్షత వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలిక ఉత్తర్వులు

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి అధ్యక్షత వహించేందుకు ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ షేక్ మున్నును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగింపు వస్తున్నందున మార్చి నెలాఖరులోగా మున్సిపల్ బడ్జెట్ సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్ పీఠం కోసం మూడు నెలలుగా జరుగుతున్న నాటకీయ పరిణామాలతో పీఠం ఖాళీగా ఉంది. ఈ క్రమంలో హైకోర్టు ఉత్తర్వులను అనుసరించి చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ గెజిట్ విడుదల చేయడంలో ఆలస్యం జరుగుతోంది. ఆలోగా ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తుండడంతో ఆర్మూర్ మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను అధ్యక్షతన నిర్వహించడానికి మాత్రమే ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ఈ తాత్కాలిక ఉత్తర్వులను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారి జారీ చేశారు.

మున్సిపల్ అధికారులు బడ్జెట్ సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకొని తేదీని ఖరారు చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

బీఎస్పీకి అమర్‌నాథ్ రాజీనామా


ఎం అమర్‌నాథ్‌బాబు

బోధన్: ఉమ్మడి రాష్ట్రంలో హస్తకళల కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన మండలంలోని పెంటాకుర్దు క్యాంప్ సొసైటీకి చెందిన ఎం అమర్‌నాథ్ బాబు బీఎస్పీకి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) బోధన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన పోటీ చేశారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీఎస్పీ మధ్య ఎన్నికల పొత్తువల్ల చోటుచేసుకునే రాజకీయ పరిణామాలతో తనకెలాంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. ఇక తాను బీఎస్పీలో కొనసాగలేనన్నారు. ఇక నుంచి తాను స్వతంత్రుడనని, ఏ పార్టీతో సంబంధం లేదని పేర్కొన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటను సంబంధించి నియోజకవర్గ నాయకులు తనకు కనీస సమాచారం ఇవ్వకపోవడంతో కలత చెందానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసి చర్చిస్తానని తెలిపారు.

హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూనియర్ హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు కంజర్ మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల విద్యార్థులు ఎంపికై నట్లు ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు క్రీడాకారులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు నవీన్‌ను కంజర్ పాఠశాలలో బుధవారం అభినందించారు. కంజర్ గురుకులం నుంచి ప్రణయ్, రుత్విక్, ప్రమోద్, శ్రీనివాస్ ఎంపికయ్యారని ఆర్‌సీవో తెలిపారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 5న నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించగా, 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారితో జట్టును ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీవరకు వరంగల్‌లో నిర్వహించనున్న 45వ రాష్ట్రస్థాయి బాలుర హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు.

కబ్జా, బెదిరింపుల కేసులో మరొకరి రిమాండ్

కామారెడ్డి క్రైం: దేవునిపల్లి శివారులో ప్లాట్లు కబ్జా చేయడమే కాకుండా బెదింపులు, దాడులకు పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు ఈ నెల 3న ఇద్దరు ప్రజాప్రతినిధులు సహా నలుగురిని రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ఏడుగురిపై కేసు నమోదై ఉంది. మరో ముగ్గురిని రిమాండ్ చేయాల్సి ఉండగా బుధవారం ఉరుదొండ రవి కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్ రావు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రుద్రూర్: కోటగిరి పీఎస్ పరిధిలోని పోతంగల్ మండలం హంగర్గా ఫారంలో ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సాగుకు సాంకేతికత అనుసంధానం

- 'రైతు నేస్తం'ను సద్వినియోగం చేసుకోవాలి
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు


మెంట్రాజ్‌పల్లిలో పాల్గొన్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రైతులు

నిజామాబాద్‌రూరల్/పెర్కిట్/ఎడపల్లి/బాల్కొండ: సాగు రంగానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్ భూపతిరెడ్డి అన్నారు. జిల్లాలోని ఆర్మూర్, ముప్కాల్, ఎడపల్లి, మెంట్రాజ్‌పల్లి రైతు వేదికల్లో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా 'రైతు నేస్తం' కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డితోపాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆర్మూర్‌లో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, ఎడపల్లిలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, ముప్కాల్‌లో డీఆర్డీఏ నోడల్ అధికారి సాయాగౌడ్, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు ప్రతి మంగళ, శుక్రవారం రెండు రోజులు నిష్ణాతులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులను సంప్రదించి తమ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. సాగు ఖర్చులు తగ్గించుకోవడం, నూతన వంగడాల తయారీ, అధిక దిగుబడులను సాధించేందుకు పాటించాల్సిన పద్ధతులపై సలహాలు, సూచనలు, మెళకువలు తెలుసుకునేందుకు 'రైతు నేస్తం' దోహదపడుతుందన్నారు. పంట మార్పిడిపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోకుండా వారిని ఆదుకునేందుకు అన్ని పంటలకు బీమా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వమే పూర్తిగా బీమా ప్రీమియం భరిస్తూ, వచ్చే వానకాలం సీజన్ నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేయనుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ప్రతి రైతు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఆయా రైతు వేదికల్లో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని విన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, పశు సంవర్థక శాఖ సంయుక్త సంచాలకులు జగన్నాథ చారి, డీపీవో చక్రవర్తి తరుణ్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సింగ్‌దాస్, ఏడీఏ మల్లయ్య, ఆర్డీవో సుదర్శన్‌గౌడ్, ఆత్మ పీడీ ఆర్ తిరుమలప్రసాద్, ఏవోలు, ఏఈవోలు, అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, అధికారులు


ఎడపల్లిలో జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రజితాయాదవ్..


ముప్కాల్‌లో పాల్గొన్న రైతులు

అక్రమంగా 'కారుణ్య' పోస్టుపై ఇంటెలిజెన్స్ ఆరా?

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: అక్రమంగా 'కారుణ్య' పోస్టు శీర్షికన ఈనెల 5న 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వర్గాలు ఆరా తీసినట్లు తెలిసింది. నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి కారుణ్య నియామకమైన వ్యక్తి 11 సంవత్సరాలుగా కొనసాగుతున్నా జిల్లాస్థాయి అధికారులు తెలిసీ తెలియనట్లు నటిస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'సాక్షి'లో కథనం రావడంతో ఈ వ్యవహారంపై ఇంటెలిజెన్స్, విజిలెన్స్ వర్గాలు పూర్తి వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు సమాచారం. సదరు ఉద్యోగి డిప్యుటేషన్ కాలం పూర్తయిన తరువాత కూడా భద్రాద్రి కొత్తగూడెంలో విధులు నిర్వహించారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే 2023లో ఏప్రిల్ నుంచి జూన్ వరకు విధులు నిర్వహించిన ఆయన దానికి సంబంధించి జులై 25న పైరవీ చేసుకొని వర్క్‌ఆర్డర్ తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, సాలూర పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నట్లు వేతనం తీసుకున్నట్లు తెలిసింది.

పరిశోధనలకు సదస్సులు దోహదపడుతాయి


సదస్సులో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): భావితరాల పరిశోధనలకు తెలుగు సదస్సులు దోహదపడుతాయని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. 'తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు – సమాలోచన' అనే అంశంపై తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూర్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సదస్సు రెండోరోజైన బుధవారం కొనసాగింది.

ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. తెలుగు శాస్త్ర కావ్యాలపై రెండు రోజులపాటు నిర్వహించిన చర్చ భావి తరాల పరిశోధకులకు ఉపయోగపడుతుందన్నారు. తెలుగు శాస్త్ర కావ్యాల్లో చెప్పబడిన వివిధ అంశాలను సహేతుకంగా నిరూపించడం ద్వారా వాటి ప్రామాణికతను పెంచవచ్చని పేర్కొనినారు. సదస్సులో ప్రొఫెసర్లు మాడభూషి సంపత్‌కుమార్, కరిమిండ్ల లావణ్య, పి కనకయ్య, తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణచక్రవర్తి, సంధ్యారాణి, డాక్టర్ రాజిరెడ్డి మహేందర్‌రెడ్డి, డాక్టర్ పమ్మి సత్యనారాయణశాస్త్రి, కళ్యాడపు రమేశ్, రాధా సారంగపాణి, విజయ్, మృదుల నందవరం తదితరులు పాల్గొన్నారు.

ఏఈపై ఏడీఈ దాడి

- ఎస్టిమేషన్ విషయంలో ఇద్దరి మధ్య గొడవ
- షాక్‌లో విద్యుత్ ఉద్యోగులు

నిజామాబాద్‌నాగారం/ఎడపల్లి: రియల్ ఎస్టేట్ వెంచర్ వర్క్‌కు సంబంధించి ఎస్టిమేషన్ విషయంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఎడపల్లి ఏడీఈ, ఏఈకి మధ్య గొడవ జరిగింది. రెండు రోజుల క్రితం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిబంధనల ప్రకారం ఎస్టిమేషన్ వేస్తానని ఏఈ స్పష్టం చేయగా, తాను చెప్పిందే వినాలని.. ఇష్టం వచ్చినట్లు చేస్తే కుదరదని ఏడీఈ ఆదేశించాడు. ఏఈ ఎస్టిమేషన్ రూపొందించి.. ఏడీఈ చెప్పినట్లు ఎస్టిమేషన్ వేసినట్లు అందులో పేర్కొన్నాడు. ఓరల్‌గా చెబితే తాను చెప్పినట్లు ఎస్టిమేషన్ వేసినట్లు ఎందుకు పేర్కొన్నావని ఏడీఈ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏఈపై చేయి చేసుకున్నాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఓ కాంట్రాక్టర్ ముక్కుకు కూడా గట్టిగా దెబ్బతగిలినట్లు తెలిసింది. సెక్షన్ ఆఫీస్‌లో ఓ కాంట్రాక్టర్ ముందే ఏఈని ఏడీఈ కొట్టడంతో అందరూ షాక్ గురయ్యారు.

విషయం తెలిసింది

ఏడీఈ, ఏఈ మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం గొడవ జరిగినప్పటికీ..రాతపూర్వకంగా ఎవరూ ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు అందగానే విచారణ చేపడతాం.

– ఎండీ ముక్తార్, డీఈ, బోధన్

ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది



బాల్కొండలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

- హామీలు అమలుచేసే వరకు ఊరుకోం..
- పత్తాలేని రుణమాఫీ, రైతుబంధు
- ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా ఎందుకు చేయడం లేదు?
- ధర్నాలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

బాల్కొండ: కాంగ్రెస్ తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, హామీలు అమలు చేసేవరకు ఊరుకునేది లేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఇప్పుడు ఆట మొదలైందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా బుధవారం బాల్కొండలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ మంచి ఉద్దేశంతో ఎల్‌ఆర్‌ఎస్‌ను ప్రవేశపెడితే ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఏదేదో మాట్లాడారని విమర్శించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎల్‌ఆర్‌ఎస్‌ను ఇప్పుడు ఎందుకు ఉచితం చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో 24 లక్షల మందిపై 20 కోట్ల భారం పడుతోందని, ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ రైతురుణమాఫీ, రైతుబంధు పత్తా లేదన్నారు. రైతుబంధు ఇవ్వాలని అడిగితే ఓ మంత్రి చెప్పుతో కొడతానని అన్నారని, ఎవరు ఎవరిని చెప్పుతో కొడతారో కాలమే నిర్ణయిస్తుందన్నారు. పింఛన్లను పెంచడం లేదని, 200 యూనిట్ల ఫ్రీ కరెంటుకు కొర్రీలు పెడుతున్నారని, సిలిండర్ పత్తాలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డివి తుపాకిరాముడి మాటలని, హామీలను అమలు చేయకుండా కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి, ముస్కు భూమేశ్వర్, శేఖర్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్ రూరల్: చార్జీలు లేకుండా ప్లాట్లను క్రమబద్ధీకరించాలని జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితం చేయాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి బీఆర్‌ఎస్ ఎంతో కృషిచేసిందని, మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తాము ఇప్పటికీ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. తప్పుడు హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. నగర మేయర్ దండు నీతూకిరణ్, జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, సుమనారెడ్డి, భారతి, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో రైతుల వాగ్వాదం

- రసాభాసగా రూరల్ సొసైటీ మహాజన సభ


అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ సొసైటీ మహాజన సభ బుధవారం రసాభాసగా సాగింది. సొసైటీలో అప్పటి సీఈవో శివరామరాజు, క్యాషియర్ భాస్కర్ దొంగ రశీదులు ఇచ్చి రైతులను మోసం చేశారని జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ రావు నివేదిక అందించిన విషయం తెలిసిందే. ఈ నివేదిక మేరకు బుధవారం నగరంలోని కోట గల్లీలో గల సంఘ భవనంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి పాలకవర్గం, అధికారులు, రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమకు న్యాయం చేయాలని అధికారులతో వాగ్వాదం చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. నకిలీ దశీదులతో రైతులను మోసం చేసింది అప్పట్లో పని చేసిన సీఈవో, క్యాషియర్లే అని తెలిపారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి ఉన్నత అధికారులకు పంపారు. రైతులు మాట్లాడుతూ.. తాము లోన్ కట్టినా మళ్లీ నోటీసులు పంపారని వాపోయారు. నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి


సత్యం (ఫైల్)

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ శివారులో విశ్వనాథ్ సత్యం (44) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. జాకోరా క్రాస్ రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడనే సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించామన్నారు. మృతుడు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించామని తెలిపారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. సత్యంది సాధారణ మృతినా లేక ఎవరైన హత్య చేశారా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

నవీపేట: పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని బినోలకు చెందిన అయిటి గంగారాం(60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ బుధవారం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న గంగారాం ఈనెల 1న ఆత్మహత్యాయత్నం చేశాడని, కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడని తెలిపారు.

యువతి ఆచూకీ లభ్యం




ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని కళ్యాణి గ్రామానికి చెందిన యువతి గత నెల 29వ తేదీన అదృశ్యం కాగా, ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన యువతి సుప్రియ హైదరాబాద్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు టెక్నాలజీ ఆధారంగా గుర్తించారు. సదరు యువతిని తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. కేసును ఛేదించిన పీసీ మహేశ్‌ను సీఐ రవీందర్ నాయక్‌తో పాటు ఎస్సై అభినందించారు.

సినీ ఇండస్ట్రీలో రాణిస్తున్న శ్రీమన్నారాయణ

- 'వి లవ్ బ్యాడ్ బాయ్స్' చిత్రానికి రెండు పాటలు రాసిన జిల్లావాసి



నిజామాబాద్ సిటీ: సినీ ఇండస్ట్రీలో గేయ రచయితగా నిజామాబాద్‌కు చెందిన శ్రీమన్నారాయణాచార్య(విరాట్) రాణిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన విరాట్ హిందీ కవిగా తనదైన శైలిలో కవిత్వాలు వినిపించి పలు రాష్ట్రాల్లో పురస్కారాలు అందుకున్నారు. రాజు రాజేంద్రప్రసాద్ దర్శకత్వంలో ఇటీవల చిత్రీకరణ పూర్తి చేసుకున్న 'వి లవ్ బ్యాడ్ బాయ్స్' చిత్రానికి రెండు పాటలు రాయగా, అవి ప్రేక్షకులను ఎంతగానో అలరిస్తున్నాయి. గోదావరి, ఆనంద్, చందమామ సినిమాలకు సంగీతం అందించిన రాధాకృష్ణతోపాటు భూషణ్‌జాన్‌తో తెలుగు, హిందీలో పలు ఆల్బమ్స్ చేశారు. అలాగే సిరివెన్నెల సీతారామశాస్త్రి టీమ్ ప్రాజెక్టును విరాట్ హిందీలో రాశారు. శ్రీమన్నారాయణాచార్య మరిన్ని సినిమాలకు పాటలు రాసి, చిత్ర పరిశ్రమలో తనకంటూ చక్కని గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.



వి లవ్ బ్యాడ్ బాయ్స్ సినిమా పోస్టర్

ఇసుక డంపులు స్వాధీనం



ఇందల్వాయి: మండలంలోని కొత్త కోరుట్ల తండాలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 10 ట్రాక్టర్ల ఇసుక డంపులను బుధవారం ఉదయం సీజ్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై మనోజ్ తెలిపారు. ఇసుకను రెవెన్యూ అధికారులకు అప్పగించామని, డంప్ చేసినవారి వివరాలు తెలియరాలేదని ఎస్సై అన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక తరలిస్తే సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఎర్తింగ్ పైపులు, వైర్లు చోరీ



ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠానాకలాన్ శివారులో ఉన్న జైతాపూర్, బాపునగర్, ఠానాకలాన్ రైతులకు చెందిన వ్యవసాయభూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్ పైపులు, వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఘటనాస్థలాన్ని ఎస్సై విక్రమ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. పంటలు పొట్టదశలో ఉన్న సమయంలో నీరందకపోతే ఎండిపోతాయని, రెండు నెలలుగా అనేకసార్లు బోరుమోటార్ల వైర్లను దొంగలు ఎత్తుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు నిఘాసారించాలని కోరగా, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పెంచుతామని ఎస్సై రైతులకు హామీ ఇచ్చారు.

పెద్దమ్మ ఆలయంలో..

ఎడపల్లి(బోధన్): మండలంలోని అంబం (వై) గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయంలో దుండగులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. హుండీలోని రూ.18వేల నగదుతోపాటు అమ్మవారి పుస్తె, కళ్లకు పెట్టిన వెండి తొడుగు, బొట్టు, మెట్టెలు ఎత్తుకెళ్లారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎడపల్లి పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ హల్‌చల్



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్ కాలనీలో గుర్తుతెలియని మహిళ బుధవారం హల్‌చల్ చేసింది. సుమారు 10 నుంచి 15 ఇళ్లలోకి చొరబడిన సదరు మహిళ తలుపులుమూసి లోపలి నుంచి గడియపెట్టుకొని ఇబ్బందులకు గురిచేసింది. స్థానికులు ఆమెను పట్టుకొని విచారించగా పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సైలు అశోక్, అజమ్మ కాలనీకి చేరుకొని మహిళను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారిని కోర్టులు హాజరుపర్చగా, న్యాయమూర్తి సయ్యద్ ఖదీర్ ఒకరికి జైలుశిక్ష, ఆరుగురికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ వి వెంకటనారాయణ తెలిపారు. బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఆరుగురికి మొత్తం రూ.6100 జరిమానా విధించారన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి


మాట్లాడుతున్న సీఐ కృష్ణ

బాన్సువాడ రూరల్: శాంతి భద్రతల పరిరక్షణకు గ్రామస్తులు సహకరించాలని బాన్సువాడ పట్టణ సీఐ కృష్ణ కోరారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని హన్మాజీపేట్‌లో పర్యటించి గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేవారు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పేకాడటం, గంజాయి, హుక్కా తాగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మాజీ సర్పంచ్ సుభాష్, నాయకులు బోనాల సాయిలు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

సంతలో దొంగల చేతివాటం

సెల్‌ఫోన్లు, పర్సుల చోరీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ప్రతి బుధవారం పెద్ద ఎత్తున జరుగుతున్న సంతలో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. పట్టణానికి చెందినవారితోపాటు పరిసరాల ప్రాంతాల ప్రజలు కూరగాయలు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు సంతకు వస్తుంటారు. ఇదే అదునుగా దొంగలు సెల్‌ఫోన్లు, పర్సులతోపాటు ఇతర విలువైన వస్తువులను చోరీ చేస్తున్నారు. ప్రతి బుధవారం సంతలో చోరీలు మామూలు విషయం మారింది. సంత జరిగే ప్రాంతాలోకి వాహనాలు వస్తుండడంతో రద్దీ ఎక్కువవుతోంది. పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించడంతోపాటు నిఘా సారిస్తేనే చోరీలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది.

ఇటీవల జరిగిన చోరీలు..

- మామిడిపల్లికి చెందిన జీవన్, గంగామోహన్ కురగాయలు కొనుగోలు చేస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.20వేల విలువైన ఫోన్లను దొంగిలించారు.
- ఆర్మూర్‌కు చెందిన రమేశ్, శ్రీనివాస్ అనే వ్యక్తుల ఫోన్లను చోరీ చేశారు.

పోలీస్ బృందాలను ఏర్పాటు చేస్తాం

- రవికుమార్, ఎస్‌హెచ్‌వో, ఆర్మూర్ సంతలో చోరీలు జరుగకుండా పోలీసులు బృందాలను ఏర్పాటు చేస్తాం. నిఘాసారించి సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్న వారిని పట్టుకుంటాం.